క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

బకాయి వేతనాల కోసం ఉపాధి కార్మికుల నిరసన



గొర్లివానిపాలెం పని ప్రదేశంలో ఆందోళన చేస్తున్న ఉపాధి కార్మికులు

పరవాడ: ఉపాధి హామీ పథకం కార్మికులకు చెల్లించాల్సిన బకాయి వేతనాలను తక్షణమే విడుదల చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాల విడుదల కోసం సిటు ఆధ్వర్యంలో గొర్లివానిపాలెం పని ప్రదేశంలో ఉపాధి కూలీలు మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 8 వారాల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో, వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. పని ప్రదేశంలో మంచినీరు, మజ్జిగ సరఫరా చేయాలన్నారు. తట్ట, పార, గునపాంలకు డబ్బులు చెల్లించాలన్నారు. ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం పన్నాగాలు పన్నుతోందని ఆరోపించారు. కొలతతో పని లేకుండా ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం రూ.309 వేతనం చెల్లించాలన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఏడుగురికి కోర్టు రూ.66 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. మంగళవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

శిథిల కల్వర్టుతో ప్రయాణికుల ఇబ్బందులు



చేపల బజారు వద్ద మురుగు కాలువపై నిర్మించిన కల్వర్టు దుస్థితి

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామంలో పలుచోట్ల డ్రైనేజీ మీదుగా నిర్మించిన కల్వర్టులపై ఏర్పాటు చేసిన సిమెంట్ పలకలు ధ్వంసం కావడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాడచీపురుపల్లి సంతబయలులో చేపల బజారు, పంచాయతీ కార్యాలయం ఎదుట మురుగు కాలువలపై ఏర్పాటు చేసిన పలకలు శిథిలమయ్యాయి. చేపల బజారు వద్దనున్న కల్వర్టుపై సిమెంట్ పలక విరిగిపోవడంతో ఎస్సీ, బీసీ కాలనీలకు రాకపోకలు సాగించే ప్రజలు, చేపల బజారుకు వచ్చే వినియోగదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారిలో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు రాకపోకలు సాగించడం ఇబ్బందిగా ఉందని చెప్పున్నారు. పలకలు విరిగిపోవడంతో ఓపెన్ డ్రైన్‌గా మారి వీటి నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. కాలువలపై విరిగిన సిమెంట్ పలకల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కూటమి పాలనలో ఇసుకాసురుల ఇష్టారాజ్యం!

ఉచిత ఇసుక విధానం అమలు చేస్తాం.. సామాన్యులకు ఇసుక అందుబాటులో **ఉండే** విధంగా సమగ్రమైన ఇసుక విధానం.. **తీసు**కొస్తామంటూ కూటమి ప్రభుత్వం **మేనిఫె**స్టోలో పేర్కొన్న హామీ దిక్కూమొక్కూ **లేకుం**డా పోతోంది. కూటమి పాలనలో **ఆయా** పార్టీల నేతలే ఇసుకాసురులుగా **మారి,** రవాణా చార్జీల పేరిట ఇసుక ధరను **రెట్టింపు** చేస్తున్నారు. దీంతో నియోజకవర్గంలో **కొత్తగా** గృహ నిర్మాణం చేపట్టేవారు భారం **మోయలే**నంతగా మారిందని వాపోతున్నారు.

- నేతల అండతో అనధికారిక స్టాక్ పాయింట్‌లు
- నియోజకవర్గంలో జోరుగా అక్రమ ఇసుక వ్యాపారం
- ఇతర ప్రాంతాల నుంచి తరలిస్తున్న వ్యాపారులు
- రవాణా చార్జీల పేరుతో భారీ దోపిడీ



పెందుర్తి సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక



చినముషిడివాడలో ఇసుక లోడ్‌తో లారీలు

పెందుర్తి: ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక ప్రజలకు అక్కరకు రాకుండా పోయింది. కూటమి నాయకులు, వారి అండదండలున్న వ్యాపారులు ప్రజలను, నిర్మాణదారులను దారుణంగా ముంచేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో ఎక్కడా ఇసుక రీచ్‌లు లేకపోవడం వీరికి కాసుల పంట కురిపిస్తోంది. పొరుగు జిల్లాల నుంచి ఇసుక తరలింపు పేరిట రవాణా చార్జీల రూపంలో భారీగా దోచుకుంటున్నారు. గతంలో ఇసుకతో కలిపి ఉన్న ఉన్న ధర కంటే ప్రస్తుతం కేవలం రవాణా చార్జీలే ఎక్కువని ప్రజలు ఆక్షేపిస్తున్నారు.

అనధికారిక స్టాక్ పాయింట్లతో..

పెందుర్తి, పరవాడ, సబ్బవరం మండలాల్లో ఎక్కడా ప్రభుత్వం అనుమతి పొందిన ఇసుక రీచ్‌లు లేవు. ఇక్కడ నిర్మాణాలకు సరిపడే ఇసుక లభ్యం కాదు. దీంతో ఇక్కడి వ్యాపారులు శ్రీకాకుళం, ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఇసుకను తీసుకొచ్చి అనధికారిక స్టాక్ పాయింట్లలో నిల్వ ఉంచుతున్నారు. ఇసుక రవాణా వ్యవహారమంతా కూటమి నాయకుల కనుసన్నల్లోనే జరుగుతోంది. తమకు నచ్చిన రీతిలో ధరలు నిర్ణయించి విక్రయాలు జరుపుతున్నారు. దీంతో ఇంటి నిర్మాణం భారమవుతోంది. కొన్నిచోట్ల ఈ అక్రమ రవాణా వ్యవహారం పోలీసులకు, మైనింగ్ అధికారులకు కాసులు కురిపిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా రెవెన్యూ అధికారులకు ఈ ఇసుక అనధికారిక స్టాక్ పాయింట్లు కల్పతరువుగా మారిపోయాయి.

డిమాండ్ సృష్టించి.. ధర పెంచి

పెందుర్తి, చినముషిడివాడ, పురుషోత్తపురం, సబ్బవరం, పరవాడ కేంద్రంగా శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన ఇసుకను విక్రయిస్తుంటారు. అయితే ఇక్కడ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డిమాండ్‌ను బట్టి వ్యాపారులు తమకు నచ్చిన ధరను నిర్ణయిస్తున్నారు. చినముషిడివాడ వేదికగా నిత్యం రూ.లక్షల్లో అక్రమ ఇసుక వ్యాపారం జరుగుతోంది. ప్రస్తుతం పెద్దలారీ(దాదాపు 7 యూనిట్ల) ఇసుక ధర కనీసం రూ.25 వేల నుంచి రూ.30 వేలకు విక్రయిస్తున్నారు. వాస్తవానికి శ్రీకాకుళం రీచ్ నుంచి పెందుర్తికి 7 యూనిట్ల లారీ ఇసుక తరలించాలంటే రూ.12 వేలు లోపు రవాణా చార్జీలు పడతాయి. కానీ ఇక్కడకు ఇసుక తరలించి స్టాక్ పాయింట్‌లలో ఉంచి డిమాండ్ సృష్టించిన తరువాత ఇష్టం వచ్చిన ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారు.

కన్నెత్తి చూడని యంత్రాంగం

పరవాడలో తీరం నుంచి సముద్రపు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. దీన్ని సాధారణ ఇసుకతో కలిపి నిర్మాణదారులకు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ అంతా అక్రమమేనని తెలిసినా, నియంత్రించాల్సిన అధికారులు మామూళ్లకు అలవాటు పడి అటువైపు కన్నెత్తి చూడట్లేదన్న విమర్శలు కోకొల్లలు. ఇసుక వ్యాపారం చేస్తున్న కూటమి నాయకుల అధికార బలంతోనూ, డబ్బుతోనూ అధికారుల నోళ్లు మూయిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు అక్రమ ఇసుక రవాణాపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

అక్రమ రవాణాపై కఠిన చర్యలు



పెందుర్తి ప్రాంతంలో ఇసుక అమ్మకాలపై మాకు ఫిర్యాదులు రాలేదు. అధిక ధరలకు అమ్మకాలు చేస్తున్నట్లు ఆధారాలతో ఫిర్యాదులు చేస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం. అవసరమైన వారు సొంతంగా రవాణా ఏర్పాటు చేసుకుంటే చాలా వరకు ఆదా చేసుకోవచ్చు. అనధికార స్టాక్ పాయింట్‌లపై ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో మా సిబ్బందిని కూడా అప్రమత్తం చేస్తున్నాం.

–ఎం.ఆనంద్‌కుమార్, తహసీల్దార్, పెందుర్తి

వైఎస్సార్‌సీపీ అధ్వర్యంలో క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న బోర మోహన్‌రెడ్డి

సింహాచలం: ఈ నెల 10న జరగనున్న అడవివరం గ్రామదేవత పైడితల్లి పండగ మహోత్సవాన్ని పురస్కరించుకుని 98వ వార్డు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు బోర మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. విజినిగిరిపాలెం క్రీడా మైదానంలో బోర మెహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలో నాలుగు రోజులపాటు జరిగే టోర్నీలో 14 టీమ్‌లు పాల్గొంటున్నాయన్నారు. విజేత జట్టుకు రూ.15 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేల నగదు బహుమతిని అమ్మవారి పండగరోజు వైఎస్సార్‌సీపీ ఏర్పాటుచేసే కళావేదికపై అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లంక సత్తిబాబు, ఆదిరెడ్డి, బోర లక్ష్మణరెడ్డి, సిరిపురపు కృష్ణ, శిడగం తాతబాబు, తొమురోతు రాము, మజ్జి ధర్మ, ఎస్.అప్పారావు, మహంతి ప్రసాద్, బోర ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలు కేంద్రంగా నగర సంకీర్తన



సమావేశంలో మాట్లాడుతున్న నాగపేర్రాజు

పరవాడ: ప్రతిగ్రామంలో దేవాలయాలు కేంద్రంగా నగర సంకీర్తన, భజన కార్యక్రమాలను నిర్వహించడానికి సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు చర్యలు తీసుకోవాలని పరవాడ ఖండం కన్వీనర్ మల్లిమడుగుల నాగపేర్రాజు కోరారు. పరవాడ సినిమాహాలు కూడలిలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన ఫౌండేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9న హిందూ సామ్రాజ్య దినోత్సవంలో భాగంగా ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. దేవాలయాలు కేంద్రంగా బాల వికాసాలు ఏర్పాటు చేసి చిన్న పిల్లలకు సంస్కృతీ సాంప్రదాయాలపై అవగాహన పెంచాలన్నారు. సమావేశంలో ఫౌండేషన్ సహాయ కన్వీనర్ బొద్దపు నూకరత్నం, మండల ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు, డి.సంజీవరావు, గొర్లి ఎరుకునాయుడు, పైల శ్రీను, బి.గోవింద, కె.రామారావు, ఎల్.అప్పలనాయుడు పాల్గొన్నారు.

'కూటమి' మోసాలను ఎండగడదాం రండి..



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదీప్‌రాజ్, నియోజకవర్గ నాయకులు

- 'వెన్నుపోటు దినం' పోస్టర్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: ఏడాది క్రితం ఎన్నికల్లో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి నాయకులు ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి దారుణంగా మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ఎండగట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిన తీరును నిరసిస్తూ బుధవారం పెందుర్తిలో తలపెట్టిన వెన్నుపోటు దినం పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. రాంపురంలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబుకు ప్రజలను మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య అన్నారు. వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ అయిన చంద్రబాబుకు పవన్‌కల్యాణ్ జతకలిసి ప్రజలను దారుణంగా వంచించారని మండిపడ్డారు. ప్రజలను వంచించిన కూటమి ప్రభుత్వం తిరిగి ఏడాది పాలనలో ఏదో సాధించామని గొప్పలు చెప్పుకునేందుకు కార్యక్రమాలు చేయడం సిగ్గు చేటన్నారు. తక్షణమే సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చేలా ఒత్తిడి తెచ్చేందుకు పెందుర్తిలో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు రాంపురం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి ర్యాలీగా పెందుర్తి తరలివెళతామన్నారు. పార్టీ నేతలు బయిలపూడి భగవాన్ జయరామ్, మధుపాడ అంజి, గొరపల్లి శ్రీను, యతిరాజుల నాగేశ్వరరావు, మెంటి మహేష్, కొయిలాడ శ్రీను, కోన శ్రీనివాసరావు, గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, బి.ఎస్.రాజు, ఇతర ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మపాలెంలో సౌర వెలుగులు

సాక్షి ఎఫెక్ట్..



ముత్యాలమ్మపాలెంలో వెలుగులీనుతున్న సోలార్ విద్యుత్ దీపాలు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సౌజన్యంతో తీరప్రాంత గ్రామం ముత్యాలమ్మపాలెంతోపాటు, నాయుడుపాలెం, వాడచీపురుపల్లి శివారు పోలిరెడ్డిపాలెం, ఊటగెడ్డపాలెం ఎస్సీ కాలనీలలో 90 సోలార్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. 'తీరం అంధకారం'శీర్షికన ఫిబ్రవరి 1న సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎన్టీపీసీ యాజమాన్యం స్పందించింది. ప్రతిపాదనలు, నిధుల కేటాయింపుల కారణంగా కాస్త ఆలస్యమైనా.. తాజా ఏర్పాటుతో తీరప్రాంత గ్రామం సోలార్ విద్యుత్ దీపాల వెలుగులతో కళకళలాడుతుంది. దిబ్బపాలెం వేటలదిబ్బ నుంచి బంగారమ్మ ఆది దేవతల ఆలయాలకు వెళ్లే రహదారి, దిబ్బపాలెం, ముత్యాలమ్మపాలెం శ్మశాన వాటికలు, జాలరిపేట అమ్మవారి ఆలయం, సమ్మెంగపాలెం అంబేడ్కర్ విగ్రహం ప్రాంతాల్లో సోలార్ వీధి లైట్లు ఏర్పాటు చేశారు. రాత్రివేళల్లో రాకపోకలకు సౌకర్యంగా ఉందని మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. సముద్రంపై చేపల వేట సాగించే గంగపుత్రులకు అనేక విధాలుగా ఉపయోగపడతాయని సంతోషం వెలిబుచ్చారు. మత్స్యకార గ్రామాల్లో సోలార్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసిన సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యానికి, తమ ఇబ్బందుల్ని పత్రికా ముఖంగా బయటపెట్టిన సాక్షి దినపత్రికకు గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత, ఎంపీటీసీలు ఆరిజిల్లి దేవి రవి, మైలపల్లి అప్పన్న కృతజ్ఞతలు తెలిపారు.

అనధికార విద్యుత్ కోతలతో ఇక్కట్లు



సబ్బవరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్

సబ్బవరం: మండలంలో అనధికార విద్యుత్ కోతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. విద్యుత్ సరఫరా ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు ఉండదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. గత నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా మరింత అధ్వానంగా మారింది. ముందే వేసవి కావడంతో గృహ వినియోగదారులతో పాటు వాణిజ్య సంస్థలు, చిరు వ్యాపారులు తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకసారి సరఫరా నిలిచిపోతే మళ్లీ ఎప్పుడు పునరుద్ధరిస్తారో తెలియక వినియోగదారులు తలలు పట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత విద్యుత్ కోతలు అధికం కావడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం విద్యుత్ కోతలు ఇలా ఉంటే.. ఇక ముందు ముందు వర్షాకాలంలో మరెలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌ఈసీఎస్ విలీనం తర్వాత మరిన్ని వెతలు

సబ్బవరం మండలంలో సెక్షన్–1 సబ్బవరం విద్యుత్ సబ్‌స్టేషన్, సెక్షన్–2 అంతకాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా జరిగే సబ్బవరం గ్రామీణ ప్రాంతంలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. గతంలో సబ్బవరం ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఆర్‌ఈసీఎస్ పరిధిలో ఉండేది. ఆర్‌ఈసీఎస్‌ను ఏపీఈపీడీసీఎల్‌లో విలీనం చేశాక నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని అంతా అనుకున్నారు. ప్రస్తుతం గాలివాటంలా ఉన్న విద్యుత్ సరఫరాపై ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే లేడని మండల వాసులు వాపోతున్నారు. దీనిపై ఏపీఈపీడీసీఎల్ అధికారులతో పాటు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు వేడుకుంటున్నారు.

'వెన్నుపోటు దినం' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు

సింహాచలం: ఏడాది కూటమి పాలన తీరుని ఎండగడుతూ బుధవారం భీమిలిలో నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని, విజయవంతం చేయాలని ఆ పార్టీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు పిలుపునిచ్చారు. భీమిలి నియోజకర్గం పరిధి అడవివరంలోని ఓ కల్యాణమండపంలో వార్డు స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. సూపర్ సిక్స్ హామీల జాడే కానరావట్లేదన్నారు. కూటమి పాలనను ఎండగడుతూ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని నియోజకవర్గాల్లో మాదిరి భీమిలిలో వెన్నుపోటు దినం కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వార్డు మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, యువజన విభాగం అధ్యక్షుడు బోర మోహన్‌రెడ్డి, నాయకులు లంక సత్తిబాబు, దమ్ము ఎర్రాజీరావు, బోర కృష్ణారెడ్డి, సిరిపురపు కృష్ణ, శిడగం తాతబాబు, బోర లక్ష్మణరెడ్డి, ఎస్.అప్పారావు, కిషోర్, బోర ప్రసాదరెడ్డి, ఆదిరెడ్డి, దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ దివస్‌పై అవగాహన



విద్యార్థులకు స్వచ్ఛ దివస్‌పై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్ రాజు

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు కథలు చెప్పి, అందులో నీతిని వివరించారు. పద్యాలు, శతకాలు, వ్యాకరణం నేర్పించారు. రిసోర్స్ పర్సన్ సీహెచ్‌ఎస్‌ఎన్ రాజు, గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

వైభవంగా ముత్యాలమ్మ పండగ



అమ్మవారి అనుపు మహోత్సవంలో భక్తులు

సింహాచలం: అడవివరం గ్రామదేవత ముత్యాలమ్మ పండగ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారిని గ్రామస్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అనుపు మహోత్సవాన్ని అమ్మవారి పూజారి వంశీయులైన లండ వంశస్తుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఘటాలతో ఊరేగింపు చేశారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు. అమ్మవారి పూజారి వంశీయుడు లండ వెంకట రమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'పవర్ గ్రిడ్' అభివృద్ధికి యువ ఇంజినీర్లు కీలకం



వాల్వ్ హాల్ రోబోట్‌ను ప్రారంభిస్తున్న పీజీసీఐఎల్ డైరెక్టర్ నవీన్ శ్రీవాస్తవ్

పరవాడ: పవర్ గ్రిడ్ అభివృద్ధికి యువ ఇంజినీర్లు దోహదపడాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(పీజీసీఐఎల్) ఆపరేషన్స్ డైరెక్టర్ నవీన్ శ్రీవాస్తవ్ పిలుపునిచ్చారు. ఉక్కునగరంలోని హెచ్‌వీడీసీ ఉపకేంద్రంలో ఏర్పాటు చేసిన వాల్వ్ హాల్ రోబోట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రానున్న రోజుల్లో పవర్ గ్రిడ్‌ను మరింత అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. కొత్త గ్రిడ్ కోసం రూ.3 వేల కోట్లను ఖర్చు చేసే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. పవర్ గ్రిడ్‌లో ఏర్పాటు చేసిన వాల్వ్ హాల్ రోబోట్ అత్యంత విలువైన ఆవిష్కరణగా అభివర్ణించారు. అనంతరం చీఫ్ ఇంజినీర్ సంతోష్ మాట్లాడుతూ మానవ జోక్యం లేకుండా లోపల ఏ విధమైన ప్రమాదం జరిగినా ఈ రోబోట్ గ్రహిస్తుందన్నారు. సాంకేతిక సమాచారం కూడా తెలియజేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌టీఎస్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.నాగరాజు, ఉపకేంద్రం ఇన్‌చార్జ్ వి.కె.చంద్రసేన్, కార్పొరేట్ సెంటర్ నుంచి రాజిల్ శ్రీవాస్తవ్, సీజీఎంలు, సీనియర్ జీఎంలు, మేనేజర్లు, పవర్ గ్రిడ్ అధికారులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' నిరసనకు తరలిరండి

పరవాడ: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో పెందుర్తి ఎమ్మార్వో కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పరవాడ మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు పిలుపునిచ్చారు. ఉదయం 8.30 గంటలకు అదీప్‌రాజ్ స్వగ్రామం రాంపురం నుంచి ప్రారంభమవుతున్న నిరసన కార్యక్రమంలో పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీలు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొనాల్సిందిగా కోరారు.

బస్టాప్ ఒక చోట.. ఆపేది మరోచోట

దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద అక్కరకురాని సిటీ బస్సులు



దువ్వాడ ఫ్లైఓవర్ వంతెన వద్ద సిటీ బస్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద ప్రతి పది నిమషాలు, పావుగంటకు సిటీ బస్ సౌకర్యం ఉన్నా ప్రయోజనం లేకుండా పోతుంది. సిబ్బంది తీరుతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నాలుగు ప్లాట్‌ఫారం వైపు సింహాచలం నుంచి చోడవరం వెళ్లే బస్సులు బస్టాప్ వద్ద ఆపుతున్నా, వివిధ ప్రాంతాల నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వచ్చే సిటీ బస్సులు మాత్రం స్టేషన్‌కు వంద మీటర్ల దూరంలో నిలుపుతున్నారు. కొంతమంది సిబ్బంది ఫ్లైఓవర్ వంతెన వద్ద నిలిపేస్తుంటే.. మరికొంత మంది నాగదేవత కొండ వద్ద ఆపుతున్నారు. రైల్లో ప్రయాణికులు దిగి బస్టాప్‌కు వచ్చేసరికి బస్‌లు దూరంగా ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. కొంతమంది బస్ నిలిపిన చోటకు వెళ్లి బస్ ఎక్కుతుంటే బస్టాప్‌కు వస్తాం ఎక్కొద్దని వారిస్తుండడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది తీరు చూస్తుంటే ఆటోడ్రైవర్లకు సహకరించేలా ఉందని, బస్‌లు నిలపడానికి బస్టాప్ వద్ద స్థలం ఉన్నా దూర ప్రాంతంలో నిలపడం, ప్రయాణికులు ఆటోల్లో వెళ్లిన తర్వాత బస్టాప్‌కు రావడంలో అంతర్యం ఏంటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజా రవాణా సంస్థ అధికారులు స్పందించి బస్టాప్ వద్ద బస్‌లు నిలిపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చదువుకుందాం రండి..



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో నిర్వాహకులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఆర్.జానకీరామ్ 'బొమ్మల యుద్ధం' అనే నీతికథను వినిపించారు. ఉపాధ్యాయుడు ఎం.ఎస్.మహేష్ పేపర్‌తో బొమ్మలు తయారు చేయడం నేర్పించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు ఇంగ్లీష్ నేర్పించారు. పలు ఆటలు ఆడించారు. యోగా గురువు లక్ష్మీప్రసన్న ధ్యానంపై మెళకువలు నేర్పారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com